నిందితులను కఠినంగా శిక్షించాలి

బోర్లం గ్రామంలో నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

బాన్సువాడ రూరల్, జనవరి 13 : మెదక్ జిల్లాలోని రామాంతాపూర్‌లో మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో అంబేద్కర్ సంఘం సభ్యులు సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలకు భద్రత కరువైందని అన్నారు. అభం శుభం తెలియని మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడి చేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నల్లోల్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి మన్నె అనిల్, కార్యవర్గ సభ్యులు ఆనంద్, దిలీప్, శివ, సిద్ధు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల గుర్తింపు

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

కామారెడ్డి, జనవరి 13 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో షబ్బీర్ అలీ కాలనీలో సోమవారం బడి బాట సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు బడి ఈడు పిల్లలను గుర్తించారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీ చిరంజీవి, ఉపాధ్యాయుడు రవి తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్యకు నేషనల్ ప్రీమియర్ అవార్డ్స్

ఐశ్వర్య

కామారెడ్డి, జనవరి 13 : నేషనల్ ప్రీమియర్ అవార్డ్సు 2024-25కు సంబంధించిన 6వ సీజన్ డాన్స్ పోటీలు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో కాకతీయనగర్ కాలనీలోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఐశ్వర్య నేషనల్ లెవల్ టాపర్ ఇన్ డాన్స్ అవార్డును సాధించింది. ఈ అవార్డు రావడంతో తల్లిదండ్రులు సుధాకర్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సంక్రాంతి సందడి..

- ఊరూరా పండుగ వాతావరణం
- గంగిరెద్దుల విన్యాసాలు
- గాలిపటాల రెపరెపలు
- మూడు రోజుల వేడుకలు
- హరిదాసుల కీర్తనాలు

గాలిపటాలతో చిన్నారుల సంబురాలు

కామారెడ్డి, జనవరి 13 : పల్లెలన్నీ సంక్రాంతి పండుగ సంబురంలో మునిగితేలుతున్నాయి. పట్టణాలకు వెళ్లినవారంతా పల్లెలకు చేరుకోవడంతో సందడి నెలకొన్నది. దూర ప్రాంతాల్లో ఉన్నవారంతా పల్లెలు, గ్రామాలకు చేరుకుంటున్నారు. సొంతూరిలో సంబురాలు జరుపుకొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆనందంగా జరుపుకొనే మూడు రోజుల పండుగ సంకాంత్రి.

వంటకాల్లో మహిళలు నిమగ్నం..

సంక్రాంతి వంటకాల్లో గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా మహిళలు నిమగ్నమయ్యారు. పిండి వంటకాలకు ప్రత్యేకమైన పండుగ సంక్రాంతి. ప్రతి ఇంట్లో పిండి వంటలు సిద్ధం అవుతున్నాయి. సకినాలు, గారెలు, బూరెలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగకు ఇంటి ముందర రంగు రంగుల ముగ్గులు వేస్తారు. రంగు రంగుల గాలిపటాలను ఆరుబయట ఉన్న ప్రదేశాలకు దాబాలపైకి ఎక్కి పోటాపోటీగా పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా ఎగురవేసి సంబురపడతారు. సంక్రాంతికి పక్షంరోజుల ముందు నుంచే హరిదాసుల సంకీర్తనలు మారుమోగుతాయి. అక్షయ పాత్రను నెత్తిన ధరించిన హరిదాసుల చేతిలో చిడతలు ధరించి ఇంటి ముంగిళ్లలో విష్ణునామ సంకీర్తనలు పాడుతారు. రైతులు తాము పండించిన ధాన్యం గింజలను హరిదాసుల అక్షయపాత్రలో పోయడం ఆనవాయితీగా వస్తున్నది.

సూర్యుడు ఏ రాశిలో ప్రవేశిస్తే ఆ కాలాన్ని ఆ రాశి పేరుతో వ్యవహరిస్తారు.

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఆ రాశిని మకర సంక్రాంతి అంటారు. పెద్దల నుంచి పిల్లల వరకు అత్యంత ప్రీతి పాత్రంగా ఆదరించే పండుగల్లో సంక్రాంతి ఒకటి. మకర సంక్రాంతి తర్వాతి రోజు కనుమ పండుగ వస్తుంది. దీనిని పశువుల పండుగ అని కూడా పిలుస్తారు. పల్లెల్లో పేదలకు పశువులే గొప్ప సంపద. అవి ఆరోగ్యంగా ఉంటే పాడి రైతుకు ఉత్సాహం. పంటల్లో వీటి పాత్ర ఎంతో ఉంటుంది. వాటిని ప్రేమగా చూసుకునే రోజుగా కనుమ పండుగను భావిస్తారు. అందుకే కనుమ రోజు పల్లెల్లో రైతులకు వ్యవసాయంలో సహకరించే పశువులను పూజించడం ఆచారం. పశువుల పాకలను చక్కగా అలంకరించి అక్కడ పాలు, కొత్త బియ్యంతో పొంగలి వండుతారు. ఆ పొంగలిని దేవుళ్లకు నైవేద్యం సమర్పించి, తర్వాత పొలానికి తీసుకెళ్లి చల్లుతారు. దీనిని పాలా చల్లడం అంటారు. సంవత్సరంపాటు పండే పంటలు చీడపీడలు సోకకుండా కాపాడమని దేవతలను ప్రార్థించడం అని అర్థం. కనుమ రోజు గొబ్బెమ్మలు, గంగిరెద్దుల హడావిడి, హరిదాసుల రాక, కోడి పందాలు, బంతిపూల తోరణాలు, కొత్త జంటల విహారాలు ఎంతో ఆహ్లాదకరంగా పండుగను జరుపుకొంటారు.

సేవాలాల్ ఆలయానికి లక్ష విరాళం

లింగంపేట, జనవరి 13: మండలంలోని నల్లమడుగు పెద్దతండాలో నిర్మిస్తున్న సేవాలాల్, జగదాంబ ఆలయాలకు హైకోర్టు న్యాయవాది మోయిన్ అహ్మద్ ఖాద్రీ సోమవారం రూ.లక్ష విరాళం అందించినట్లు తండావాసులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కోరగా వెంటనే లక్ష రూపాయలు అందించినట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు రవీందర్ గౌడ్, నల్లమడుగు పెద్ద తండా మాజీ సర్పంచ్ రవీందర్‌నాయక్, ఈశ్వర్, డాక్యా, బన్సీ తదితరులు ఉన్నారు.

చైనా మాంజాతో బాలుడికి గాయాలు

మోర్తాడ్, జనవరి 13:చైనా మంజా ఓ బాలుడ్ని తీవ్రంగా గాయపరించింది. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కమ్మర్‌పల్లికి చెందిన బాలుడు రఘు (3) సోమవారం ఇంటి ముందర ఆడుకుంటున్నాడు. అయితే, ఎవరో ఎగురవేసిన గాలిపటం తెగిపోయింది. దానికి వినియోగించిన చైనా మాంజా బాలుడి గొంతుకు తగలడంతో గాయమైంది. రఘును దవాఖానకు తరలించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారమిచ్చారు.

చైనా మాంజా అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కావలి యాదగిరి తన షాపులో తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను సోమవారం అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. కమ్మర్‌పల్లిలో చైనా మాంజా కారణంగా రఘు అనే బాలుడు గాయాలపాలు కావడంతో స్పందించిన పోలీసులు చైనా మాంజా అమ్ముతున్న వారి గురించి వాకబు చేశారు. చైనా మాంజా అమ్ముతున్న యాదగిరిపై కేసు నమోదు చేశారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

నస్రుల్లాబాద్, జనవరి 13 : నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతివనంలో పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరినుంచి రూ.1,300, మూడు సెల్ ఫోన్లు, ఆరు బైకులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

సంక్రాంతి సంబురాల్లో భాగంగా కామారెడ్డిలోని స్వప్నలోక్ కాలనీలో సోమవారం ముగ్గుల పోటీలు, భోగి మంటల కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

వాహనాల తనిఖీ

బీబీపేట్, జనవరి 13: బీబీపేట మండలంలోని శ్రీగాధ రోడ్డు వద్ద హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, పోలీస్ సిబ్బంది కలిసి సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 మంది వాహన దారులకు జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది అనిల్ కుమార్, ఫయాజ్, శ్రీరాం పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

రాజంపేట్, జనవరి 13 : రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో కర్ణాల రఘునాథ్ స్మారక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శని, ఆదివారాల్లో నిర్వహించారు. విజేతగా సెవన్‌స్టార్ ఆదిలాబాద్ జట్టు, రన్నరప్‌గా కామారెడ్డి పోలీస్ టీంలు నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజంపేట ఎస్సై పుష్పరాజ్ చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. టోర్నమెంట్‌ను చక్కగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోదా రంగనాథ కల్యాణం

చుక్కాపూర్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాచారెడ్డి/బీబీపేట్, జనవరి 13 : మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, బీబీపేటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతి ఏటా ఆలయంలో కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారికి తలంబ్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, పారాయణం, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్ రావు, అర్చకులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాల్లో ఎమ్మెల్యే పోచారం

నస్రుల్లాబాద్, జనవరి 13 : బీర్కూర్ మండలంలోని రైతునగర్ గ్రామంలో జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబురాల్లో వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వంట గది

మద్యం సేవించి పాఠశాల వరండాలో పారవేసిన గ్లాసులు

నిరుపయోగంగా పాఠశాల భవనం

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నిరుపయోగంగా మారిన లింగంపేట బాలుర ప్రాథమిక పాఠశాల భవనం

పాఠశాల గదిలో వృథాగా క్రీడా పరికరం

లింగంపేట, జనవరి 13: విద్యాబోధన చేయడానికి నిర్మించిన పాఠశాల భవనాలు వృథాగా వదిలివేయడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలుర పాఠశాల భవనాన్ని వృథాగా వదిలేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో, పాఠశాలను మూసి వేశారు. విద్యార్థులను బాలికల ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అప్పటి నుంచి పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. సదరు పాఠశాలలోని ఉపాధ్యాయులు సైతం ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. క్రీడా పరికరాలను సైతం తొలగించి పాఠశాల గదిలో నిరుపయోగంగా వదిలేశారు. గ్రామ శివారులో పాఠశాల భవనం ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాఠశాల వైపు ఎవరు కన్నెత్తి చూడక పోవడంతో మందు బాబులకు అడ్డాగా మారింది. గది తాళం పగులగొట్టి గదిలోని పాఠ్యపుస్తకాలు చిందరవందరగా పారేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేయడానికి ప్రత్యేకంగా వంట గది సైతం నిర్మించి వృథాగా వదిలేశారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలు వృథాగా మారాయి.

అధికారులు స్పందించి పాఠశాల భవనాలు ఉపయోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం మందు బాబులకు అడ్డాగా మారిన విషయమై ఎంతవో షౌకత్ అలీని వివరణ కోరగా విషయం తనకు తెలియదని అన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

లింగంపేట, జనవరి13: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సోమవారం తెలిపారు. ఆయన వెంట మండల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, జనవరి 13 : మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఇందిరాబాయి, రాములు, జాగుర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి

లింగంపేట, జనవరి 13: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగభాగ్యాలు కలగాలని పూజలు చేశారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

నాగిరెడ్డిపేట, జనవరి 13: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీ మూడోరోజు కొనసాగింది. టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొనగా సోమవారం సెమీస్‌లో గోపాల్‌పేట బీ టీమ్, జప్తిజాన్కంపల్లి తలపడగా జప్తిజాన్కంపల్లి టీమ్ గెలుపొందింది. గెలిచిన టీమ్‌తో పోచారం టీమ్ తలపడింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ ఉంటుందని ఆర్గనైజర్స్ ఇమామ్, మైను, దత్తు తెలిపారు. గెలుపొందిన టీమ్‌లకు సాయంత్రం నగదు పారితోషకంతో పాటు కప్, వ్యక్తిగత షీల్డులు అందిస్తామని వారు తెలిపారు.

త్రిలింగేశ్వరాలయాన్ని సందర్శించిన డీజీఎం

ఆలయంలో సివిల్ సప్లయీస్ డీజీఎం లక్ష్మీ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాగిరెడ్డిపేట, జనవరి 13: తాండూర్ త్రిలింగేశ్వరాలయాన్ని సోమవారం హైదరాబాద్‌కు చెందిన సివిల్ సప్లయీస్ డీజీఎం లక్ష్మి, నాంపల్లి కోర్టు ఏపీపీ నవీన్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని సోమేశ్వరుడు, భీమేశ్వరుడు, రామేశ్వరుడులకు అభిషేకాలు చేశారు. ఆలయ చరిత్రను ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తును అడిగి తెలుసుకున్నారు. ఆలయం చాలా విశిష్ఠత కలిగి ఉన్నదని, చరిత్ర కలిగిన గొప్ప ఆలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. వారి వెంట లాయర్ రవీందర్‌గౌడ్ ఉన్నారు.

లిఫ్టు ఇచ్చి బంగారు నగల చోరీ

నిజాంసాగర్, జనవరి 13 : మహిళకు లిఫ్టు ఇచ్చి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై శివకుమార్ తెలిపిన ప్రకారం.. మంగ్లూర్‌కు చెందిన లచ్చవ్వ, విఠల్ కలిసి కిష్టాపూర్‌లో బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి అటు వైపు వెళ్తున్నానని నమ్మించి వారిని బైక్ ఎక్కించుకున్నాడు. మంగ్లూర్ గేటు వద్ద మహిళను కొట్టి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగునీటి కోసం బోరుబావుల తవ్వకం

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్), జనవరి 13: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించడానికి గ్రామాల్లో బోరుబావులు తవ్విస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బోరు డ్రిల్లింగ్ పనులు సోమవారం ప్రారంభించారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/s. Shriram Finance Ltd, Branch: Banswada** had agreed to accord Loan to **Veerapaneni Roopa W/o. Veerapaneni Sharath Babu,** Aged 51 Yrs, Occ:Business, R/o. H.No. 1-74, Mirzapur Camp, Kotagiri (M), Dist.Nizamabad by mortgage of the schedule referred property of **Veerapaneni Sheshu Madhav S/o. Veerapaneni Sharath Babu.** The above prospective Loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised after wards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice.

SCHEDULE OF THE PROPERTY

That the Open Plot No.4 & 5 bearing H.No. 1-63, Situated Mirzapur of Kotagiri Village, Kotagiri Mandal, Nizamabad District within the limits of Gram Panchayat Kotagiri, Mandal Parishat Kotagiri, Zilla Parishat Nizamabad under the Jurisdiction of Regn.Sub Dist Bodhan and Dist. Regn.Nizamabad. Admeasuring Plot Area: Plot No.4 : 1135.00 Sq.Feets equal to 126.11 Sq.Yards, Plot No.5 1115.62 Sq.Feets equal to 123.95 Sq.Yards **Total area 250.06 Sq.Yds.**

Bounded as: North: 30'-0" Canal Boundary **South:** Plot No.3,**East:** 16'-0" Wide Road, **West:** House of Sri Udaya Bhaskar

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell: 9848094409

నేడు లింగంపేటలో

ముగ్గుల పోటీలు

లింగంపేట, జనవరి13: లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌ డ్ సోమవారం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు నాగన్న బావి వద్ద ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ బహుమతి 5తులాల వెండి, ద్వితీయ బహుమతి మూడు తులాల వెండి, తృతీయ బహుమతి రెండు తులాల వెండి, ప్రోత్సాహక బహుమతులుగా రైస్ కుక్కర్, ప్రెషర్ కుక్కర్ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

పెద్ద కొడప్‌గల్, జనవరి 13 : వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని వ్యాపార యజమానులకు ఎస్సై మహేందర్ సూచించారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై వ్యాపారస్తులకు ఎస్సై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. సీసీ కెమెరా ఏర్పాటు వల్ల దొంగతనాల నివారణ, భద్రతా ప్రమాణాలు మెరుగుపడుతాయని తెలిపారు. దొంగతనం చేసిన వ్యక్తులు, వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం కెనరా బ్యాంక్ వద్ద ఏటీఎంను పరిశీలించి బ్యాంక్ అధికాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ వద్ద అనుమానాస్పదంగా ఎవరైన వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెద్ద కొడప్‌గల్‌లోవ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

నాయక్ పోడ్‌ల జిల్లా నూతన కమిటీ

నిజాంసాగర్, జనవరి 13 : ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం సర్వ సభ్య సమావేశం గాంధారి మండలం చెన్నాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో సేవా సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొట్ట పెంటయ్య, కోశాధికారిగా సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా పుట్ట వెంకట్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ముత్యాల సంజీవులు, సాంస్కృతిక కార్యదర్శిగా పుట్ట బాలరాజ్, ఉపాధ్యక్షులుగా కంది సాయిలు, పెంకటి గణేశ్, మన్నె సాయిరాంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాయిలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిర్నపల్లి సాయిలు, కుర్తి కాశీరాం, జమ్ముల శంకర్, బూర్గుల రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

లింగంపేట, జనవరి13: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని లింగంపేట ఎస్సై సుధాకర్ అన్నారు. మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎల్లారెడ్డి డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో డివిజన్ స్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరేశ్, అరవింద్, భువర్దన్, మహేశ్ కుమార్, మహేందర్, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.